# కొత్త పులి

దేశంలో మిగిలివున్న కాస్త మంచినీ కాల్చేస్తున్నట్లుగా ఎండలు మండిపోతున్నాయి. ఎంత గొప్ప చంద్రుడయినా మమ్మల్నేం చేయలేడన్నట్లుగా పొద్దుబోయినా వడగాల్పులు తగ్గలేదు. ఇక ఊళ్ళో ఉండటమే మహా కష్టం అన్నట్లుగా– కన్న దూడకు పాలుగూడా ఇవ్వలేని ఆవు పొలాలమ్మటబడింది. నీకంటే మేం మాత్రం ఏం బాగున్నాంలే అన్నట్లుగా వున్న పొలాల్ని దాటుకుంటూ– కాస్త చల్లగాలి తిరిగే సమయానికి అడవిలో కాలు పెట్టింది.

పొట్ట నకనకలాడుతోంది. అటు ఇంట్లో దూడ వట్టిబోయిన తల్లిని చూచి పాలకు బదులు నెత్తురు పీల్చలేక నీరసబడిపోతోంది.

చంద్రుడు కళ్ళెత్తితేనేగాని కనబడని ఎత్తుకు ఎదిగాడు.

చల్లదనంతో ముడుచుకు పడుకున్న ఆకుల మధ్య ఆవుకి మరో ప్రపంచంలో కాలు పెట్టినంత ఊపిరి వచ్చింది.

దబదబా గడ్డితిని పరుగెడితే తన బిడ్డకు కడివెడు పాలు ఇవ్వచ్చు అన్నంత ఆనందమొచ్చింది. ఆ ఆనందంలో పిచ్చిగా పరుగెత్త సాగింది.

అక్కడే పప్పులో కాలేసింది.

ఓ పులి ఆ ఆవును చూడనే చూచింది.

"ఆగు!" గర్జించింది.

వణికిపోయింది ఆవు.

"రా! తినేస్తాను!" అన్నది.

భయంతో కళ్ళుమూసుకొని కుప్పలా కూలబడిపోయింది ఆవు!

* * *

అసహ్యం దుప్పటిని కప్పుకున్నట్లుగా ఆ ప్రదేశమంతా నల్లటి చీకటిని మీదకు లాక్కున్నది. దుష్టుడికి దూరంగా వుండండి అన్నట్లుగా ఆ యింటికి దూరంగా అక్కడో యిల్లు యిక్కడో యిల్లు వున్నది. చెడు ఎప్పుడూ అంద వికారే అన్నట్లుగా ఆ యింటి గోడలు ఉప్పు చవుడు రాలుస్తున్నయి. ఆ యింటి చుట్టూ పిచ్చి మొక్కలు అడ్డదిడ్డంగా పెరిగి వున్నాయి. ఎప్పుడో నాలుగయిదు రోజులకొకసారి సరదా చేయటానికి దయ్యాలు వేంచేస్తయి అన్నట్లుగా మనుష్యుల అలికిడి.

లోపల హాలు మధ్య విరిగిపోయిన కుర్చీలో వీరభద్రం కూర్చొని వున్నాడు రాజసింహాసనంమీద రారాజులాగా. అతగాడి ఎదురుగ్గా మంత్రులూ, సామంతులూ అన్నట్లుగా చలపతీ, సుభాష్, రామ్మూర్తి, నిరంజనం కూర్చున్నారు. ఆ ఊళ్ళో తాము పంచపాండవులం అనుకుంటారు వాళ్ళు... ఊళ్ళో వాళ్ళు మాత్రం కురుక్షేత్ర సంగ్రామంలో పోయిన వాళ్ళు పోగా రోజులు లెక్క పెట్టుకుంటున్న మిగిలిన కౌరవులే అంటారు వాళ్ళని.

వీరభద్రం జరుగుతున్న ఆలస్యానికి అసహనంగా మూలుగుతూ అటూ యిటూ కదిలాడు. అప్పటికీ కోటీలు- వాళ్ళ నమ్మినబంటు- మోహినీ థియేటర్ ముందు 'బడాభాయ్' బండిమీద తెచ్చిన రెండు డజన్ల పచ్చిమిరపకాయ బజ్జీలు, పావుకిలో చుడువా, అరకిలో పకోడీలు టేబుల్ మీద పెట్టి, 'జైహింద్ బార్' నుంచి తెచ్చిన సీసాల్లో రెండింటికి మూతలు తీసి, పాత గాజు గ్లాసుల్లో పోసి, వాళ్ళ ముందు పెట్టాడు.

మాసిపోయి కంపుకొడుతున్న జేబురుమాలతో చేయి తుడుచుకుంటూ, "మరి నే వెళ్ళొస్తా!" అన్నాడు. ఆ సీన్లోకి ఓ మెరుపును అద్దెకు తీసుకు వచ్చి వాళ్ళకు మరింత కిక్కునిచ్చేటందుకు.

"పదిరూపాయలు పోయినా కాస్త గట్టిదాన్ని పట్రారా సన్నాసీ... కొత్తదాన్ని చూడు!

కోటీలు అతి వినయంగా తల ఊపి బయిటకు వచ్చి తన పాత డొక్కు సైకిల్ ఎక్కాడు. అలా ఎక్కుతుండగానే అతగాడికి సావిత్రి గుర్తుకు వచ్చింది.

సావిత్రి వాళ్ళింటి ఎదురింట్లో రెండు సంవత్సరాల రోగిష్టి పిల్లకు తల్లి. సంపాదించిన నాలుగు రూపాయల్ని సాయంత్రంకల్లా గుండూగాడి సారాకొట్లో రెండు గుక్కల్లో అపుపోసనపట్టేసే పతిదేవుడు వెంకటేశుకి మూడు సంవత్సరాలబట్టీ అర్ధాంగి. ఆ చుట్టుపక్కల రెండు మూడు వీధుల్లోనూ తన కిష్టంలేకుండా ఎవడైనా ఆవులించినా అటు ఆరుతరాల వారినీ, ఇటు ఆరుతరాల వారినీ తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టగల దిట్ట రాలపులమ్మకి స్వయానా కోడలు.

సావిత్రి అరవిచ్చిన మందారంలా వుంటుంది. పసిమి బంగారు ఛాయ కాకపోయినా చిలకలపూడి నెక్లెస్‌లా నిగనిగలాడుతుంటుంది. బెంగుళూరు అరటిపండులా నిండుగా పొడుగ్గా వుంటుంది. అప్పుడప్పుడూ మొగుడు త్రాగిన మైకంలో పెళ్ళాం మీద ప్రేమ పుట్టుకురాగా కొనుక్కొచ్చిన చవకరకం కొత్త చీరలో ఉండి ఉండి మెరుస్తుంటుంది. ఆ త్రాగుడి మైకంలోనే తరచూ మొగుడిచేత తినే దెబ్బల చారలు తెగిపోయిన బంగారు గొలుసుకు అక్కడక్కడా అతుకులు వేసినట్లుంటాయి.

అంత దగుల్బాజీ కొంపలోనూ, పెళ్ళయిన నెల తిరక్కుండానే కడుపవ్వగా పసికందు రత్నం పదిహేను రోజుల బట్టీ మూసిన కన్ను తెరవకుండా కుక్కిమంచంలో కుళ్ళిపోతోంది. అందులోనే జోగుతూ, తండ్రి తాగుడు మాటల్లాగానే పేలుతుంటే రాంవులమ్మ మంత్రగాళ్ళను తీసుకువచ్చి కోళ్ళను కోయించి- వాళ్ళ తోనే బొడ్డు చుట్టూ వాతలు పెట్టించి, సావిత్రి గుండెల మీద సమ్మెట దెబ్బలు వేసింది.

వెంకటేశు- మేస్త్రీ సామాన్లు కొనుక్కు రమ్మనమని డబ్బులిస్తే- ఆ వీధిలోని టక్కులాడి అండాళ్ళమ్మను తీసుకొని, మూడురోజుల క్రితం ముప్ఫయి మైళ్ళ దూరంలోని పట్నంలో సినిమాలుచూసి, షికార్లు కొట్టేటందుకు వెళ్ళిపోయాడు. రాంవులమ్మ పక్క ఊళ్ళో పోలేరమ్మ జాతరకు మధ్యాహ్నమే వెళ్ళింది. రేపు సాయంత్రానికి గానీ రాదు.

సావిత్రి స్మశానంలోలా, పిల్లముండను ఒళ్ళో పెట్టుకొని, వాకిట్లోకి చూస్తోంది. సాయంత్రం సందు మొదట్లోని ఇంగ్లీషు డాక్టరు, పిల్లను చూసి, అప్పటికే దిగులుతో నలిగిపోతున్న సావిత్రిని నాలుగు తిట్టి, మందులు కొనుక్కు రమ్మనమని చీటీ రాసిచ్చాడు. పక్కింటి సీతను బ్రతిమలాడి పది రూపాయలు అప్పుచ్చుకొని మందులషాపు కెళితే, వాడు నవ్వేసి, ఒక్కొక్క ఇంజక్షనే పాతిక రూపాయలు, డాక్టరు రాసిన మందులన్నీ ఇస్తే మూడొందలవుతయి- నీ బోడి పది రూపాయలు, లోకల్ టాక్సెస్ ఎక్స్‌ట్రా అన్నదాంట్లో పదోవంతు లేదు- పోపో- అన్నాడు... అందుకే ఇంకేం చేయాలో తెలియక ఆ పసికందు పుట్టుకకు కారణమైనా మొగుడు ముండాకొడుకును తిట్టుకుంటూ, తనలో తానే ఏడ్చుకుంటూ, ఇంటికి వస్తుంటే- కోటీలు కనబడి పళ్ళికిలించాడు.

వాడో అడ్డగాడిద అని పేటంతటికీ తెలుసు. మోహినీ టాకీస్ వెనకాల ఆడవాళ్ళందరికీ ఎన్ని రోగాలున్నయ్యో అవన్నీ వాడికొక్కడికే వున్నయ్యని ప్రతీతి. వాడు డ్యూటీ అంటూ సైకిలెక్కాడంటే పిట్టల వేటలో ఉన్నాడన్నమాటే. హోల్‌మొత్తం ఆడవాళ్ళ కంపెనీలు ఎన్నున్నయ్యో, ఏ కంపెనీలో ఎంత మంది వున్నారో, ఏ ఆడది ఎక్కడ కొత్తగా

దిగిందో, ఒక్కొక్కదానికీ ఎక్స్‌పీరియన్స్ ఎంతో- ఏ కంపెనీకీ వాడు ఏజెంటు కాకపోయినా గడగడా చెప్పేయగలడు. ఇప్పుడు ప్రస్తుతం బిజినెస్ వున్న ఆడవాళ్ళంతా వాడు పుట్టిన ఇరవైయేళ్ళకు పుట్టి వుంటారు గనుక అందరికీ వీడు పెద్ద మనిషే... కంపెనీ మేనేజర్ ముండ దగ్గర్నించీ, పొద్దున్నే ఆ గదుల్లో అడ్డమైన గడ్డీ ఊడ్చి పోసే పిల్లముండల్దాకా అందరూ వీడ్ని- ప్రేమగా 'కోటీలన్నా' అనే పిలుస్తారు.

కోటీలుకున్న సుగుణమొక్కటే... వాడిది జాలిగుండె... "నేను కష్టాలలో వున్నాను... ఈపని నీవల్లేకావాలి, అన్నా!" అంటే- కృష్ణ పరమాత్ముడిలా ఏదోటి ఎడ్జస్టుమెంటు చేసి చక్రం అడ్డేస్తాడు. ఆ కష్టాన్ని ఆదుకుంటాడు.

అలా డ్యూటీమీదున్న కోటీలుకు మందుల షాపులో నుంచి బయిటకు వస్తూ సావిత్రి ఎదురుపడి, "డబ్బులు సర్దుతావా, అన్నా!" అన్నది తన బాధనంతా కళ్ళనీళ్ళల్లో రంగరిస్తూ.

"సరే! చూస్తాలే..." అన్నాడు జాలిపడి.

సాయంత్రం సావిత్రికిచ్చిన ఆ వాగ్దానం గుర్తుకు వచ్చి సైకిల్ని సరాసరి వాళ్ళ యింటి వైపుకే తిప్పాడు. కోటీల్ని చూస్తూనే సావిత్రి లేచి వస్తూ, "డబ్బులు తెచ్చావా అన్నా?" అన్నది ఆశగా.

"అసలు ఏమైంది... పిల్లముండకి ఎలావున్నది?" అన్నాడు పెడల్‌మీద కాలువుంచి, నేలమీద ఒక కాలు ఆనిస్తూ.

"దానికి మాయదారి రోగమేదోవచ్చింది... డాక్టరుబాబు మందులు రాశాడు... షాపు దగ్గరకు వెళితే మూడొందలు కావాలన్నాడు. నాదగ్గర పక్కింటి సీత ఇచ్చిన పదితప్పా ఇంకేంలేవు... నువ్వే ఆదుకోవాలి... మావాడు వచ్చింతరువాత సర్దుతాను- పిల్లది చచ్చిపోతుందేమోనని భయంగా వున్నది!" అన్నది ఏడుస్తూ. "డాక్టరు బాబు వెంటనే ఇంజక్షను చేయించమంటున్నాడు!"

"పదపద!" అంటూ సైకిల్ దిగి స్టాండు వేశాడు. లోపలకు వచ్చి పిల్లను చూచాడు ... అప్పటికే మగతలో పడిపోయింది ఆ పిల్ల... ఆపైన రొప్పు... గుండెలు ఎగతంతున్నాయి... రావులమ్మ పెట్టించిన బొడ్డు చుట్టూ వాతలు ఇంకా తగ్గలేదు అన్నట్లుగా పొట్ట ఎగిరెగిరి పడుతోంది.

కోటీలుకి ఆ పసిముండను చూస్తుంటే జాలివేసింది. కాసేపు అట్టాంటిదాన్ని వదిలేసి దేనితోటో పట్నంలో కులుకుతున్న వెంకటేశును తిట్టిపోశాడు. చుట్టుపక్కలెక్కడా

రాంపులమ్మలేదని ఖాయంచేసుకొని ఆమెనూ బండబూతులు తిట్టాడు..."సావిత్రిలాంటి సావిత్రి కాబట్టి నువ్వీ కష్టాలన్నీ ఓర్చుకుంటున్నావ్" అంటూ సావిత్రికో సర్టిఫికెట్ ఇచ్చేసి భుజం తట్టి "పద!" అన్నాడు.

"ఎక్కడికి?" అన్నది కోటీలు సంగతి తెలుసు కాబట్టి భయంగా.

ఒక్క సారి సీరియస్‌గా చూసి, "ముందు డబ్బు ముఖ్యం... పిల్లదాన్ని బ్రతికించు కోవటం ముఖ్యం... వెధవ్వాలోచనలు పెట్టుకోబోకు... నేను చెప్పినట్లు విను!" అన్నాడు.

అతగాడు చెబుతున్నది అర్థమవ్వగా అయోమయమయింది సావిత్రికి.

"చెల్లమ్మా! నీ కష్టం నా కష్టంగాదా... నేను మనిషిని కాదా... ఎందుకాలోచిస్తావ్... అయన మహానుభావుడు– వీరభద్రంగారంటే ఎవ్వరనుకున్నావ్... పడమట చెరువుకవతల పదెకరాల మామిడితోట ఎవరిదనుకున్నావ్– అయన తండ్రిది... దానిపక్కనే వున్న ఇరవై ఎకరాల కొబ్బరితోట ఎవరిదనుకున్నావ్– ఆయన తల్లి పుట్టింటినుంచి తెచ్చుకున్నది... దక్షిణాన వున్న గులాబీ రంగు మేడ ఎవరిదనుకుంటున్నావ్– వాళ్ళ నాయిన పర్మినెంటుగా వుంచుకున్న పంకజాక్షి కిచ్చిన ప్రజంటేషన్... వాళ్ళు చాలా పెద్ద మనుష్యులు... అల్లాటప్పా వాళ్ళనుకుంటున్నావేమో... నీకేం భయం లేదు పద... ఒక్కసారి గులాబీ పువ్వును అలా చేత్తో పట్టుకొని వాసన చూసేసినట్లు చూసేసి... బుగ్గన చిటికేసి... ఓ చిన్న ముద్దెట్టేసుకొని... డబ్బులు అనుకున్నదానికంటే ఓ పది రూపాయలు ఎక్కువిచ్చేసే– పో– అంటారు!... పదపద!" అన్నాడు తొందరపెడుతూ.

"వాడు ఊళ్ళోలేడు... రాంపులమ్మ జాతరకు పోయింది... పిల్లముండ ఇలా వుంది... ఎన్ని కష్టాల్రా నాయనా!" అన్నది పెద్దగా ఏడుస్తూ సావిత్రి.

"ఇంకేం కష్టాలూ లేవు... నీ పిల్లముండ చేత కళ్ళు తెరిపించి మాట్లాడించే పూచీ నాది... నీవల్ల కాదంటే చెప్పు... బలవంతం లేదు... నాది మాటంటే మాటే... తప్పకుండా నీకు సాయం చేస్తాను... కానీ ంత డబ్బు కావాలంటే నాలుగు రోజులన్నా పడుతుంది... నేనువెళ్ళొస్తా!... ముందు అయ్యగారి పని ముఖ్యం... అలస్యమయితే ఆయన చమడా లొలుస్తాడు!"

"అన్నా! నువ్వే ఆదుకోవాలన్నా!"

"మరి చెప్పింది విన్రాదు!"

నల్లటి నీడ సావిత్రి ముఖాన్నంతా పెద్దభూతంలా కమ్మేసింది... చుట్టూవున్న గుడిసెల కప్పుల్లోనుంచి వస్తున్న పొగ దయ్యం పట్టిన తనకు సాంబ్రాణీ వేస్తున్నట్లుగా వున్నది. ఎదురుగ్గా చావు బ్రతుకుల్లో వున్న పసిముండ కణకణలాడే నిప్పుల్తో వున్న కుంపటిలా వున్నది. కోటీలు మాటలు ఉండి ఉండి కాలుతున్న బొగ్గుల్ని కదిలించి పైనున్న బూడిదను ఊదుతున్నట్లుగా ఉన్నయి.

"ఎందుకట్లా బాధపడతావ్... పావుగంటలో వచ్చేస్తావ్... వచ్చి శుభ్రంగా కుండెడు నీళ్ళు కాగబెట్టుకొని తలారా స్నానం చేసి, తలకింత ధూపమేసుకో– ఎవ్వరికి తెలుస్తుంది నీకూ నాకూ తప్పా... ఆ వీరభద్రంగారు దేంవుడు... మూడో కంటికి తెలియనిస్తాడా ఏమిటి... ఎందుకు పసిదాన్ని చంపుతావ్... బ్రతికించుకో హాయిగా!"

సావిత్రి గుండెల్ని వెంకటేశు మెలితిప్పుతున్నట్లనిపించింది– వెధవముండాకొడుకు పెళ్ళిచేసుకోంగానే సరా... పిల్లను పుట్టించంగానే సరా... పెళ్ళాన్ని పెళ్ళాంగా చూడాలనీ, పిల్లముండని బ్రతికించుకోవాలనే యావా లేకపోతే ఎలా...?

"చెప్పు– బయిల్దేరుతున్నావా– లేదంటే పర్లేదు...మోహినీటాకీస్ దగ్గరకు వెళ్ళానంటే కొల్లలు... అక్కడయితే మధ్యలో సగం నేను కొట్టేసినా అడిగే ముండ వుండదు..." అని గొంతు తగ్గించి, "చెల్లమ్మా! చెప్పింది వినుకో... నీ మొగుడు ముండాకొడుకు ఓ దగుల్బాజీ... వాడి తల్లి రాంవులమ్మ ఓ రాక్షసిముండ... వాళ్ళు మనుష్యులుకారు... పరమకిరాతకులు ...నీ బిడ్డను బ్రతికించుకోవాల్సిన బాధ్యత నీదే... వాళ్ళెవ్వరో వస్తారు, నిన్నూ నీ బిడ్డనూ రక్షిస్తారనుకోవడం నీ బుద్ధి పొరబాటు... బ్రతికించుకున్నా... చంపుకున్నా... గుంటలో పెట్టి ఇంత మట్టి పోసినా అన్నీ నువ్వే చూసుకోవాలి... నీ బ్రతుకు నువ్వే బ్రతుక్కోవాల ... ఇదుగో ఇలా చేశావేమిటి అనేవాళ్ళు ఈ ప్రపంచంలో కోట్లు... కానీ అందులో నీ అవసరానికి ఇంత గంజినీళ్ళు పోసేవాళ్ళు ఒక్కళ్ళున్నా నన్ను చెప్పుచ్చుకు కొట్టు... కనుక సావిత్రమ్మా!... నేను చెప్పింది శుభ్రంగా వినుకో... మొన్న వెంకటేశుగాడు తెచ్చిన గులాబీ రంగు చీర కట్టుకొని సైకిలెక్కు... మళ్ళా చిటికలో తెచ్చి ఇంటి దగ్గర దించేస్తా... పిల్లముండను బ్రతికించుకొని దానిలోనే నీ ముందు జీవితం చూచుకో!"

సావిత్రి చటుక్కున లేచి నిలబడింది.

"పద!"

* * *

"మన్నించండి మహాప్రభో! అనుమతిస్తే ఒక్క క్షణం ఇంటికి వెళ్ళి రెండ్రోజులబట్టీ తిండిలేక ఎండిపోతున్న నా బిడ్డకు పాలిచ్చి ఇక తల్లి వుండదని దానికి నాలుగు బుద్ధులు చెప్పి ఇట్టే వచ్చేస్తాను!" అన్నది ఆవు.

పులి గర్జిస్తుంటే కాళ్ళ మీద పడి వలవలలాడింది ఆవు.

ఎంత రాక్షసుడికైనా గుండె వుంటుంది కాబట్టి... ఆ గుండెలో కాస్తో కూస్తో జాలీ వుంటుంది... పులి గుండెలోనూ వున్న ఆ కాస్తంత జాలి– అడవుల్లో నీడ పట్టున వుంటుంది గనుక ఎండిపోక– ఆవు మీద కనికరం చూపేలా చేసింది.

"సరే! ఫో!" అన్నది. "రాకపోయావో నిన్నేగాదు... మీ యింటికి వచ్చి నీ బిడ్డను గూడా కలిపి తినేస్తాను!"

* * *

కోటీల్ని చూస్తూనే అయిదుగురి ముఖాలూ చాటంతయినయి. పళ్ళన్నీ బయటపెట్టి ఒక్కసారి వెకిలిగానవ్వారు.

"ఏమిటిరా ఆలస్యం... తెచ్చావా?..." వీరభద్రం అడిగాడు.

"మేలిమి బంగారాన్నే తెచ్చాను సార్!"

"దేనికి ఆలస్యం... రమ్మనమను లోపలకు!"

పత్రిని చూస్తూనే వాళ్ళ ముఖాల్లో అమావాస్యనాడు ఆకాశంలోకి చంద్రుడు పుట్ట కొచ్చినట్లు అనిపించింది. వీరభద్రం ఇక ఏ మాత్రం ఆలస్యాన్ని భరించలేనట్లుగా నాలుగు పకోడీలు నోట్లో వేసుకొని కసిగా కరకరా నమిలేసి, గ్లాసులో మిగిలింది కాస్తా ఒక్క గుక్కలో తాగేశాడు. మిగిలిన నలుగురు అక్కుపక్షులూ ఇక కుర్చీల్లో కూర్చోలేం అన్నట్లుగా లేచి నిలబడ్డారు నోళ్ళు తెరిచేసుకొని.

"అమ్మ దీనమ్మ... పనసపండురా!"

"ఎంతరా సన్నాసీ?"

"బంగారమన్నాను కదా సార్... మేలిమి బంగారం... ఇలాంటిది దానికి తెలియను గూడా తెలియదు సార్... వీరభద్రంగారికి అని చెప్పేటప్పటికల్లా కాదనలేక సైకిలెక్కి వచ్చేసింది!"

వీరభద్రం కళ్ళు గర్వంతో, పొగరుమోతు తనంతో మరింత ముందుకు పొడుచుకు రాగా మీసం మెలేశాడు.

సావిత్రి అవాక్కై ఉయింది– ఆ యింటినీ, ఆ అయిదుగురినీ, వాళ్ళ ముందున్న సీసాల్నీ చూచి తనంటే తనకే అసహ్యమేసింది... కోటీలంటే అసహ్యమేసింది... మనుష్యులంటే అసహ్యమేసింది... మగాళ్ళంటే మరీ పరమ అసహ్యమేసింది.

అక్కడున్న ఆరుగుర్నీ చంపి ఆ నెత్తురు తాగేసి నడిరోడ్డు మీదకు పరుగెత్తాలన్నంత ఆవేశమొచ్చింది.

కాని– స్మశానంలో తవ్వుతున్న గుంటలు కళ్ళముందు గిరగిరా తిరుగుతున్నాయి... తనకు తనదంటూ వున్న రత్నం చావు బ్రతుకుల్లో నలిగిపోతోంది... మెలికలు తిరిగిపోతోంది.

"అయితే ఇక్కడ చిన్న తిరకాసున్నది సారూ!"

"చెప్పేడ్వరా త్వరగా!"

"దీనికో పిల్లముండుంది సార్! అది ఏ క్షణానైనా బాల్చీ తన్నేసేలా వుంది... డాక్టరు దానికి సూదిమందిస్తే బ్రతుకుతుంది అంటున్నాడు... ఆ మందులు కొనాలీ అంటే నాలుగొందలు కావాల... మనిషిని చూచారు కాబట్టి ఎడ్వాన్సుగా ఆ డబ్బులు యిచ్చేస్తే నాలుగు నిముషాల్లో పనులన్నీ పూర్తి చేసుకు వచ్చేస్తుంది!"

"నీ ఇన్నేళ్ళ సర్వీసులో ఎప్పుడైనా చూశావురా అట్లా నా దగ్గర?"

సావిత్రి గుండెల్లో బాధను భరించలేనట్లుగా ఆ చీకట్లోనే గోడకు ఆనుకొని ఒదిగుసుకుపోయింది. జరుగుతున్న అవమానానికి గుండెలు మండి పోతుండగా ఏమీ చెయ్యలేనట్లుగా తలవంచుకున్నది. అతగాడి మాటలకు వాంతి వస్తున్నదన్నట్లుగా కొత్త చీర చెంగును నోటికి అడ్డుపెట్టుకున్నది.

"కానీ తప్పదు సార్! అసలు అందుకే దీనికి ఒప్పుకుంది అది!"

"నాలుగొందలు ఇవ్వటానికి గాదురా... మళ్ళా పిట్టొస్తుందని నమ్మకమేమిటి?"

"నేను లేనా సార్!"

పూర్తిగా చెడినవాడి నోటినుండి వచ్చే పచ్చి బూతుల్లా నవ్వారు నలుగురూ, "నువ్వెందుకురా మాకు!" అంటూ.

కోటీలుకు కోపమొచ్చింది. వాడెంత అణకువగా వుంటాడో అంత కర్కోటకుడు. వాడు చేసే పనులు ఎంత ఛండాలమో అంతగా ఇచ్చిన మాటమీద నిలబడే నమ్మకస్తుడు. వాడి పళ్ళు ఎంతగా కుళ్ళిపోయిందో అంత గట్టి గుండె వాడిది.

వీరభద్రం అసహనంగా అటూయిటూ కదిలాడు. సీసాలో మందుని గ్లాసులోకి వంచుకుంటూ, "అదిగాదురా కోటీలు... నేను డబ్బులు ఇవ్వనని అనుమానమట్రా. నేను అలాచేసి ఏ ఆడకూతుర్నయినా ఇంతవరకూ అన్యాయం చేశానట్రా!" అన్నాడు.

"అదిగాదు సారూ! దాని పిల్లముండ బ్రతకాలి. అందుకే ఈ రొచ్చుగుంటలో కాలు పెట్టటానికైనా సిద్ధపడింది అది... అది కాస్తా పుటుక్కుమన్న తరువాత మీరు డబ్బులిచ్చినా ఒక్కటే యివ్వకపోయినా ఒక్కటే... అది తిరిగొచ్చే గ్యారెంటీ నేనిస్తున్నాను గదా!" అన్నాడు ఖచ్చితంగా.

వీరభద్రం మాట్లాడకపోయేటప్పటికి కోటీలుకు కోపం ఆగలేదు. గంయ్‌న లేచాడు. "దానర్థం నా మీద మీకు నమ్మకం లేదన్నమాట... పదవే సావిత్రి... ఈ ముష్టి నాలుగొందలు దారిన పోతున్న వాడిని తన్నయినా తెస్తాను... ఛత్! వెధవ ప్రపంచం!" అంటూ గిరుక్కున వెనక్కు తిరిగాడు. సావిత్రిని బయిటకు ఒక్క తోపు తోశాడు.

క్షణంలో ఆ గదిలో దీపం ఆరిపోగా తామంతా కటిక చీకట్లో పడి పోయినట్లుగా గిలగిలలాడి పోయారు ఆ అయిదుగురూ. రికానా లేని వెధవన్నర వెధవ మాటలకు వీరభద్రానికి గొంతు వరకూ కోపమొచ్చింది- కానీ అవసరం తనది... మిగతా నలుగురూ సరేసరి... ఎంగిలాకులెక్కడున్నా ఎగిరెగిరి దూకే రకం...

వీరభద్రం తమాయించుకున్నాడు. "పది నిముషాల్లో రావాలి!" అన్నాడు కఠినంగా, పక్కజేబులోనుండి నాలుగు వందలూ బయిటకు తీస్తూ.

"అలా అన్నారు బాగుంది... చిత్తం!"

బయిటకొచ్చేశాడు హుషారుగా కోటీలు. సావిత్రిని సైకిల్ మీద ఎక్కించుకొని ఆ భూతాల కొంపలో నుండి బయిట పడ్డాడు.

"ఇవుగో నాలుగొందలూ దాచుకో... నా కమీషన్ ఇరవై పర్సంట్...నువ్వు కాబట్టి పది పర్సంటే చాలు... తెల్సిన దానివి, కష్టాల్లో వున్నావ్... నాకిప్పుడు డబ్బులర్జంటేం లేదులే... లేదంటే మరోసారి ఎప్పుడైనా ఎడ్జస్టమెంటు చేసుకుందాం!"

మెడ వెనక్కుతిప్పి చురకత్తిలా చూచింది కోటీలు కళ్ళల్లోకి నిప్పులు కురిపిస్తూ సావిత్రి, తను ఎలాంటి నరకంలో కూరుకుపోతున్నదో అర్థమయినప్పుడు- దరిద్రపు పిల్ల చచ్చినా బాగుండు- అన్నంత కఠినమవుతోంది గుండె...

ఆమె చూపుకు కోపంగా తడబడ్డాడు. "పోనీలే... వెధవ కమీషన్ వదిలేశేయ్... మరోసారి అ వెధవల్ని బాగా తాగించి... కళ్ళూ, వళ్ళూ తెలియనప్పుడు... మోహినీ టాకీస్ వెనకాలున్న ఓ అద్దెగదను తెచ్చి తగిలించేశాననుకో ... డెభై ఏంటీ ఎనభై పర్సెంటయినా నాకు మిగులుద్ది!"

తనని, వాడిని, ఈ సైకిల్ని ఈ చీకట్లో ఏ లారీయో గుద్దేసి, మీదగా వెళ్ళిపోతే ఎంత ఆనందంగా వుంటుంది... ప్రాణానికి ఎంత తెరిపిగా వుంటుంది!

* * *

నడినెత్తినున్న చంద్రుడి కిందగా చెట్ల నీడల నడుమ నడిచి వస్తున్న మచ్చలేని ఆవును చూస్తూనే పులిక్కిపడింది పులి.

వెన్నెల తడి జాలిలా శరీరాన్నంతా తడిపింది. "ఆవంటే ఇదా!"

దూడకు పాలివ్వటానికి వెళ్ళమనైతే అన్నదికాని, అది తిరిగి వస్తుందనే నమ్మకం చిటికెంతగూడా లేదు. ఈ శతాబ్దంలో గూడా ఇలాంటి ఆవులు ఇంకా ఈ భూమ్మీద వున్నయ్యా అనుకున్నది.

ఆవు దగ్గరికల్లా వచ్చి, "వచ్చాను మామా!... ఇక నీదే ఆలస్యం! నేను ఆలస్యం చేసివుంటే మన్నించు!" అన్నది.

ఆమాట అంటుంటే దానికి ఏడుపు రాలేదు. కళ్ళు తడవలేదు. తృప్తిగా నిండుగా వుంది కంఠం– బిడ్డకు పాలిచ్చాననే తృప్తి, బిడ్డకు చెప్పదలుచుకున్న నాలుగూ చెప్పివచ్చాననే తృప్తి, అన్నమాట నిలబెట్టుకొని తన జాతికే వన్నె తెస్తున్నాననే తృప్తి.

– వాటన్నిటినీ మించి అందరూ ఘోరంగా చెప్పుకునే పులికిగూడా అంత మంచి మనస్సు– చేతికి వచ్చిన ఆహారాన్ని వదులుకుండేటంత విశాల హృదయం వున్నయ్యనే నిజం తను తీసుకున్న నిర్ణయానికి ఏ మాత్రం బాధను కలిగించకపోగా, ఆత్మ తృప్తినిస్తున్నది. హాయి నిస్తున్నది. ఆనందాన్నిస్తున్నది.

కాని– వింత అనుభూతితో... వివశత్వం చెందిన పులి గుండెల్లోనుంచి వెలికి వస్తున్న జాలి శరీరాన్నంతా ఆవరించగా, కళ్ల చెమర్చగా... పెగల్చలేని కంఠంతో ముద్దముద్దగా, "పో... వెళ్ళిపో... నీ బిడ్డను ఒళ్ళో జేర్చుకొని హాయిగా బ్రతుకు పో... ఈ క్షణం నుంచి నాకు తిండి దొరక్కపోతే ప్రాణమైనా విడుస్తానుగాని ఏ జీవికీ హాని చేయను!" అన్నది శపథం చేస్తున్నట్లుగా పులి!

* * *

మంచులో తడుస్తున్న యిళ్ళు మత్తుగా పడివున్నాయి... రాత్రి పెద్దదీపాలు ఆరిపోయి, గుడ్డిదీపాలు వెలుగుతున్న సమయంలో-

ఆ దయ్యాల మేడముందు ఇద్దరు ఎక్కిన సైకిలు బరువుగా ఆగింది...

సావిత్రి సైకిల్ మీదనుంచి దిగింతరువాత కోటీలు దిగాడు. ఆపైన దాన్ని నెట్టుకుంటూ వెళ్ళి పిచ్చిమొక్కల నడుమ గోడవారగా ఆనించాడు.

దొంగలముఠా వచ్చి తంతుందేమోనని భయపడ్డట్లుగా మూసుకున్న తలుపులు, వాళ్ళను చూచి కొత్త ఊపిరి వచ్చినట్లుగా తెరుచుకున్నాయి. లోపల అయిదుగురూ అజానుభాహువుల్లా ఎదిగి పంచవన్నెల చిలకకోసం నలువైపులా చూచారు.

చీకట్లో తడుస్తున్న కళ్ళతో, అదురుతున్న గుండెలతో, కోటీలు వంక ఒక్క క్షణం మసకమసగ్గా చూచి, సింహం నోరులా తెరుచుకున్న తలుపుముందు మెట్టు మీద కాలు పెట్టింది సావిత్రి.

ఒక్క క్షణంలోనే అందరి గ్లాసుల్లోని మందూ తమలోని జాలిలాగానే ఆవిరైంది. తెరిచిన తలుపుగుండా పాముల పుట్టలోకి చూస్తున్నట్లుగా ఒక్కసారి లోపలి వెలుగు జయించలేని చీకట్లోకి భయంగా చూచింది సావిత్రి.

"నేను మనిషినండి...మీరు నా మీద నమ్మకం లేకపోయినా మాట నిలబెట్టుకోవాలనే యావ వున్న మనిషినండీ నేను..." కోటీలు కంఠం దయ్యం కూతలా వినిపిస్తున్నది.

వీరభద్రం వికృతంగా నవ్వాడు.

"ముందు శ్రీవారికే నైవేద్యం... మేం వరండాలో ద్వారపాలకుల్లా ఎదురు చూస్తుంటాం!" నలుగురూ నవ్వుతూ తూలుతూ, త్రుళ్ళుతూ బయిటకు వచ్చారు.

ఇక తెల్లవారదేమో నన్నంత భయంకరంగా రెండు తలుపులూ ఒక్కసారే పెద్ద శబ్దంతో మూసుకు పోయినయి సావిత్రిని తమ వెనక్కి లాక్కుంటూ!

* * *

*(స్వాతి మాసపత్రిక: సెప్టెంబర్, 1985)*